ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

శంషాబాద్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు, సిబ్బందితో వివిధ అంశాలపై ఆయన సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సేవలు మెరుగు పర్చాలన్నారు. ఎక్కడ కూడా అపరిశుభ్రత కనిపించకుండా పనులు నిర్వహించాలన్నారు. వీధి దీపాల మరమ్మతులపై కూడా వెంటనే స్పందించాలన్నారు. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంతో పాటు అనుమతులు అందించే ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ తీరుగు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు, ట్రేడ్‌లైసెన్స్, వినోదపన్నుల లక్ష్యానికి అనుగుణంగా వసూళ్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ శ్రావణి, టౌన్‌ప్లానింగ్ అధికారి మనోహర్ ఇంజినీరింగ్ అధికారులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన



రాజేంద్రనగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ రాజేంద్రనగర్‌లోని దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్‌పీ పార్టీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పచ్చ అనిత హాజరై మాట్లాడారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ దాడి వ్యక్తిగత దాడి కాదని రాజ్యాంగంపై దాడి అని దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంబాల రాజు, సంజీవ, నర్సింగ్, వెంకటేశ్ రావు, ప్రీతంరాజ్, కార్తీక్, నాని, చాంది, ఆనందం పాల్గొన్నారు.

మలేషియాలో 'లార్డ్స్' విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు మలేషియాలోని ఐఐయూఎంలో ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసినట్లు కళాశాల జాయింట్ సెక్రటరీ సయ్యద్ తన్వీర్ అహ్మద్ వెల్లడించారు. లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేసి సహకారానికి సంబంధించిన భావి రంగాలపై స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్, ఐఐయూఎం పరిశోధన కేంద్రం డైరెక్టర్‌తో చర్చలు జరిపారు. కళాశాల నుంచి 23 మంది విద్యార్థుల బృందాన్ని అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక శిక్షణా కార్యక్రమం కోసం మలేషియాకు తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ మలేషియా(ఐఐయూఎం), ప్రముఖ మలేషియా టెక్ సంస్థ డెలోయిడ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, రియల్-టైమ్ సిస్టమ్స్‌లో ఆచరణాత్మక అనుభాన్ని అందించిందన్నారు. 15 రోజుల పారిశ్రామికి మ్మర్షన్‌లో, విద్యార్థులు సీఎన్ఎన్-ఆధారిత ఆబ్జెక్ట్ డిటెక్షన్, రియల్ టైమ్ వెహికల్ ట్రాకింగ్, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ సిస్టమ్స్ వంటి లైవ్ ప్రాజెక్ట్‌లలో పని చేశారన్నారు.

మిధానిలో ఉత్పత్తి, మార్కెటింగ్ డైరెక్టర్‌గా పదవిట్టన్ బాబు

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో ఉత్పత్తి, మార్కెటింగ్ డైరెక్టర్‌గా పదవిట్టన్ బాబు నియమితులయ్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు. పదవిట్టన్ బాబు ఒక మెటలర్జికల్ ఇంజినీర్‌గా ప్రత్యేక స్టీల్స్, సూపర్ అల్లాయ్స్, టైటానియం, మిశ్రమలోహాలు వంటి ప్రత్యేక లోహాలు, మిశ్రమ లోహాల రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం కలిగి ఉన్నారు. మార్కెటింగ్ రంగంలో ఆయన కొత్త మార్కెట్లను అభివృద్ధి చేయడంలో, ఎగుమతులను పునరుద్ధరించడంలో కస్టమర్ నిశ్చితార్థాన్ని బలోపేతం చేయడంలో, ఏరోస్పేస్, రక్షణ, శక్తి, పారిశ్రామిక అనువర్తనాలు వంటి కీలక రంగాల్లో ప్రముఖ కస్టమర్లతో దీర్ఘకాలిక సంబంధాలను నెలకొల్పడంలో కీలకపాత్ర పోషించారు.

సబ్‌స్టేషన్.. జలమయం



- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేరిన వరద
- అంధకారంలో కాలనీలు, బస్తీలు



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ డైరెక్టర్ నర్సింహులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు కాటేదాన్ పారిశ్రామికవాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి భారీగా వరద నీరు చేరింది. కాటేదాన్ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే విద్యుత్ సరఫరాను అధికారులు రాత్రి నుంచి పూర్తిగా నిలిపివేశారు. సమాచారాన్ని డీఆర్‌ఎఫ్ సిబ్బందికి తెలపడంతో వారు సబ్‌స్టేషన్‌లోకి వచ్చి మోటర్ పంపుల ద్వారా నీటిని బయటకు పంపించారు. ఇదిలా ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా చిన్నపాటి వర్షానికి కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు రావడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం సాధారణమైందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రంతా అంధకారం..

సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో కాటేదాన్ పారిశ్రామికవాడతో పాటు పలు కాలనీలు, బస్తీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరద చేరి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రతిసారి ఇలా కరెంటు కోతలు విధిస్తే తాము ఎలా ఉండేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు కాలనీలు, బస్తీలు అంధకారంలో ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ..

కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు చేరుకోవడంతో సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ డైరెక్టర్ నర్సింహులు మంగళవారం ఉదయం సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. డీఆర్‌ఎఫ్, విద్యుత్ సిబ్బందికి పలు సూచనలు చేసి వరద నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు. పనులను వేగవంతంగా పూర్తి చేయించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యపై సమీక్షించి మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు.



వరద నీటిని మోటర్ పంపులతో బయటకు పంపిస్తున్న దృశ్యం

రూ.10 కోట్లతో రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.30 కోట్ల నిధులను మంజూరు చేయించుకున్నామని తక్షణం రూ.10 కోట్లను మంజూరు చేశారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ వెల్లడించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 34 బస్తీలు, కాలనీల్లో రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు మరమ్మతులు వచ్చాయన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. కేవలం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలోని ఈ రూ.30 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో మిగిలిన రూ.20 కోట్లు మంజూరు అవుతాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు బాగా దెబ్బ తిన్నాయన్నారు. ప్రధాన రహదారులపై వెంటనే ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని ఆదేశించామన్నారు.

నెరవేరనున్న హనుమాన్‌నగర్ వాసుల కల

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ వాసుల కల త్వరలో నెరవేరనుందని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ వెల్లడించారు. నాలుగు దశాబ్దాలకు పైగా హనుమాన్‌నగర్ వాసులు గుడిసెలు వేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారన్నారు. గతంలో హనుమాన్‌నగర్ వాసులకు ఇచ్చిన హామీ మేరకు వారి సొంత ఇంటి కలను నెరవేర్చనున్నట్లు తెలిపారు. హనుమాన్‌నగర్‌లో నివసిస్తున్న వారందరి వివరాలను సేకరిస్తున్నామని ప్రతి ఒక్కరికి 100-150 గజాల స్థలాన్ని ఇచ్చేలా కృషి చేస్తానన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ నుంచి నార్సింగి వెళ్లే రోడ్డు సమస్యను అధికారులు చర్యలు తీసుకోని పరిష్కరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ శరత్‌చంద్ర అందుబాటులో లేకపోవడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బైరాగిగూడ నుంచి నార్సింగి వెళ్లే ఆర్మీ రోడ్డు వర్షాల కారణంగా గుంతలమయంగా తయారయ్యిందన్నారు. ఆర్మీలోని రోడ్డును జేసీబీతో లెవల్ చేయడానికి వెళ్లగా ఆర్మీ అధికారులు అభ్యంతరం చేయడం జరుగుతుందన్నారు. పై అధికారులతో పర్మిషన్ తీసుకోవాలని తెలుపుతున్నారన్నారు. ఇదే విషయాన్ని కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం ద్వారా సమర్పించి పై అధికారుల నుంచి పర్మిషన్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంకం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో సమావేశమైన ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

మణికొండ: జీవనోపాధికి ఆటోలను నడుపుతున్న వారిలో కొందరు ఇష్టానుసారంగా నడపటం, ఎక్కడ పడితే అక్కడ ఆపటం, ప్రయాణికుల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోవటంతో అందరికీ చెడ్డపేరు వస్తుందని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నార్సింగిలోని కేవీఎంఆర్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పని సరిగా పాటించాలన్నారు. రోడ్లపై వేగంగా నడపరాదని ఆటో డ్రైవర్లు తమ వద్ద ఆర్సీ, ఇన్సూరెన్స్ లైసెన్సు ఎల్లప్పుడు ఉంచుకుని డ్రస్సులను ధరించే ఆటోలు నడపాలన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించినా నియమాలను పాటించక పోయినా చర్యలు తప్పవన్నారు. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, అదనపు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఎస్సై రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల నుంచి వచ్చిన వినతిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఈనెల 21 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా కరెక్షన్ విండో కూడా 22 నుంచి 25 వరకు ఛాన్స్ ఉందని ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

'మనూ' దూరవిద్య కోర్సుల ప్రవేశాల గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని దూర విద్య కోర్సుల ప్రవేశాల గడువును ఈనెల 13 వరకు పొడిగించినట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజౌల్లాఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 4 ఏళ్ల బీఏ(ఆనర్స్), బీకాం (ఆనర్స్), బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, అరబిక్, చరిత్ర, ఇస్లామిక్ స్టడీస్, డిప్లొమో కోర్సులైన జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, టీచ్ ఇంగ్లీష్, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, ఉర్దూ, సర్టిఫికెట్ కోర్సులైన ఫంక్షనల్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం వంటి వాటిల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ 040-23008463 లేదా 040-23120600(ఎక్స్‌టెన్షన్ 2207,2208లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బల్దియా కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కౌసర్



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: భారీ వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన భారీ వర్షాల వల్ల కార్వాన్‌లో తలెత్తిన పరిస్థితులను ఆయనకు వివరించారు. కార్వాన్ మెయిన్ రోడ్డు, లంగర్‌హౌస్, టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్ చౌరస్తాతో పాటు టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలోని కాలనీల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. ప్రస్తుతం ఉన్న మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు సహాయక చర్యలకు సరిపోవడం లేదన్నారు. ప్రతి డివిజన్‌లకు అదనపు మాన్‌సూన్ టీమ్‌లను వెంటనే పంపాలని ఆయన కోరారు. పారిశుద్ధ్య పనుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

మున్సిపల్ కార్యాలయంపై దాడి కేసులో

కోర్టుకు బీజేపీ నాయకుల హాజరు



కోర్టు వద్ద బీజేపీ నాయకులు

మణికొండ: మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో అప్పటి కమిషనర్ పెట్టిన కేసులో భాగంగా విచారణ ప్రారంభం కావటంతో మంగళవారం బీజేపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్ షిప్ రోడ్డు నెంబర్-13 వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. దాంతో మున్సిపల్ అధికారులు దాన్ని వెంటనే తొలగించారు. ఆగ్రహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో అప్పటి మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్‌కుమార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా23 మందిపై కేసు నమోదు చేశారు. మంగళవారం నాంపల్లిలోని సీబీఐ కోర్టు హాల్లో విచారణకు రావటంతో పార్టీ నాయకులు హాజరయ్యారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం



మణికొండలో పర్యటించిన ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కాలనీల్లోనూ ట్రాఫిక్ జాం' కథనానికి ఆయన స్పందించి మంగళవారం ఆయా కాలనీల్లో పర్యటించి ట్రాఫిక్, రోడ్లు తదితర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా లింక్‌రోడ్లు, ఉన్న రోడ్ల వెడల్పు పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పనులను వెంటనే చేయాలని తమ శాఖ తరఫున ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు.

- కాలనీల్లో ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో మరింత ఇరుకుగా మారి ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్ల పక్కన అలాంటి వ్యాపారాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యే వాటిని తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై రాజేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మూసీకి పెరిగిన వరద



మంచిరేవుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

మణికొండ: ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్ సాగర్ పరీవాహకంలో భారీ వర్షాలు కురవటంతో మరోమారు జంటజలాశయాల గేట్లను మరింత ఎత్తి ఎక్కువ మొత్తంలో వరదను మూసీ నదికి వదులుతున్నారు. సోమవారం సాయంత్రం, మంగళవారం

5 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ఉదయం వర్షం కురవటంతో గండిపేటలోకి పైనుంచి 1700 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దాంతో ఆరు గేట్లను మూడు అడుగులు, రెండు గేట్లను రెండు అడుగుల ఎత్తు ఎత్తి 2488 క్యూసెక్కుల నీటిని మూసీ నదికి మంగళవారం సాయంత్రం వదిలారు. హిమాయత్‌సాగర్‌కు పై నుంచి 2వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఆరు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 2500 క్యూసెక్కుల నీటిని మూసీకి వదులుతున్నారు. జంట జలాశయాల నుంచి 5వేల క్యూసెక్కుల నీరు మూసీకి వస్తుండటంతో అది ఉధృతంగా ప్రవహిస్తుంది. మంగళవారం రాత్రికి మరింత వర్షం కురిస్తే మరిన్ని గేట్లను ఎత్తుతామని, మూసీ పరీవాహన ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని, నార్సింగి నుంచి మంచిరేవులకు వెళ్లే రోడ్డును మూసేసినట్లు అధికారులు తెలిపారు.

కొందరి నిర్లక్ష్యం.. రోడ్లు దుర్గంధం



కుళ్లిపోయినా పండ్లు, కురగాయలను ఫుట్‌పాత్‌లు, రోడ్ల పక్కన పారబోయడంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని చింతల్‌మెట్ ప్రధానరహదారిపై గత కొంత కాలంగా కొందరు కుళ్లిపోయిన పండ్లను పారబోస్తున్నారు. వర్షం కురిసిన రోజు కుళ్లిపోయిన పండ్లలో నుంచి దుర్వాసనతో పాటు ఈగలు దోమలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై కుళ్లిపోయిన పండ్ల వ్యర్థాలను పారబోయకుండా చర్యలు తీసుకోవాలని సులేమాన్‌నగర్ వాసులు కోరుతున్నారు. -శాస్త్రిపురం

ఘనంగా వాల్మీకి జయంతి



నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద వాల్మీకికి నివాళులు అర్పించిన అధికారులు

మణికొండ: వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మణికొండ క్వార్టర్స్‌లో వాల్మీకి మహర్షి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ నాగేంద్రబాబు, మణికొండ వాల్మీకి సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌నాయుడు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి సహదేవ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ బి.శరత్‌చంద్ర వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అభిలాష్ బిస్త్

టీజీపీఏలో..

బండ్లగూడ: ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ(టీజీపీఏ)లో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు కె.ఆర్.కె.ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్స్ జి.వెంకటరావు, కె.నరహరి, పి.సి.వి.రమణ, భరత్, నాగేశ్వరరావు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర తదితరులు



మణికొండలో వాల్మీకికి నివాళులు అర్పించిన సంఘం నాయకులు